ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ 5 భూపాలపల్లి
గురువారం 16 జనవరి 2025






భక్తులతో కిటకిటలాడుతున్న ఐనవోలు మల్లన్న ఆలయ ప్రాంగణం

మల్లన్నా.. శరణు.. శరణు..

శిగాలూగిన ఐనవోలు జాతర

- మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- మహానివేదనతో ఉత్సాహంగా రథం ఊరేగింపు
- అర్ధరాత్రి కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- స్వామివారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

7

పూసల లాగులు.. గజ్జెల మోతలు.. డోలు శబ్దాలు.. చేతుల్లో వీర కోలు.. త్రిశూలాలు.. ఖడ్గాలు.. నుదుటిపై బండారి పసుపు.. నెత్తిపై బోనాలు వెలుగుతున్న దీపాల నడుమ ఐనవోలు మల్లికార్జున స్వామి జాతర ఘనంగా జరిగింది. ఒగ్గు పూజారుల అందమైన పిండి పట్నాలు.. ఢమరుక శబ్దాలతో శిగాలూగింది. సకల భాగ్యాలు కలిగి సంతోషాన్ని కలిగించి.. ముట్టింది ముత్యమై.. పట్టింది బంగారమై.. పాలి వాడు దగ్గరై.. పగవాడు దూరం కావాలి.. అంటూ పర్వతాల మల్లయ్య.. మా పాలిట కలిగి ఉంటూ సల్లంగా సూడు.. మళ్లీ వస్తాం.. అంటూ స్వామి వారిని వేడుకున్నారు. మకర సంక్రాంతి వేళ ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర భక్తులతో పోటెత్తింది. ముఖ్యంగా మార్నేని వంశీయుల మహానివేదన రథం ప్రదర్శన గ్రామ పురవీధుల గుండా భక్తిభావంతో సాగింది. స్వామివారిని మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే నాగరాజు, తదితరులు దర్శించుకున్నారు.


- ఐనవోలు

వీరభద్రా.. శరభ.. శరభ..

వైభవంగా కొత్తకొండ జాతర

- వీరభద్రుడి దర్శనానికి తరలొచ్చిన జనం
- భక్త జన సంద్రంగా మారిన పరిసరాలు
- మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే నాగరాజు
- ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల రథాలు, మేకల బండ్లు

కొత్తపల్లి నుంచి జాతరకు వస్తున్న రథాలు



కోరమీసాల స్వామి.. కోరిన కోర్కెలు తీర్చే కొత్తకొండ వీరభద్రా.. శరభ.. శరభ.. అంటూ భక్తులు తండోపతండాలు తరలివచ్చారు. గుమ్మడికాయలను నెత్తినపెట్టుకుని కోరమీసాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం మకర సంక్రాంతి పర్వదినాన కొత్తకొండ వీరభద్రస్వామి జాతర ఉత్సవంలా సాగింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కొత్తపల్లి నుంచి వచ్చిన ఎడ్లబండి రథాలు, వేలేరు నుంచి వచ్చిన మేకల బండ్లు ప్రత్యేక ఆకర్శణగా నిలిచాయి. అలాగే మంత్రి పొన్నం, ఎమ్మెల్యే నాగరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. సీపీ అంబర్ కిషోర్ ఝా నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

7

- భీమదేవరపల్లి

సకుటుంబ సపరివారంగా..

- ఇంటింటా సంక్రాంతి సంబరాలు
- వాడవాడలా పర్వదినం శోభ
- ఎక్కడ చూసినా సందడే సందడి
- ముస్తాబైన ముంగిళ్లు.. ఎగిరిన పతంగులు


భూపాలపల్లిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

భూపాలపల్లిటౌన్/కాటారం/గణపురం/మల్హర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మంగళవారం మకర సంక్రాంతిని అంత్యంత వైభవంగా జరుపుకోగా బుధవారం కనుమను నిర్వహించారు. దీంతో ఊరూవాడా సందడి నెలకొంది. ప్రతి ఇంట్లోనూ పండగ శోభ సంతరించుకుంది. వృత్తిరీత్యా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు సొంతూరికి చేరుకొని కుటుంబంతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. కొత్త అల్లుళ్లు అత్తారింటికి చేరుకొని అతిథి మర్యాదలు, కానుకలు పొందారు. అందమైన ముగ్గులతో మహిళలు తమ లోగిళ్లను అలంకరించారు. పూలు, తోరణాలతో ఇళ్లను ముస్తాబు చేశారు. ఘుమఘుమలాడే పిండి వంటలు తయారు చేసి ఇంటిల్లిపాదికి, బంధుమిత్రులకు తినిపించారు. పిల్లలు, పెద్దలు పతంగులు ఎగురవేశారు. ఇలా ప్రతి ఇంట్లోనూ కుటుంబమంతా సంక్రాంతి వేడు కల్లో పాల్గొని సందడి చేశారు. సంక్రాంతి సందర్భం గా ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడాయి. ప్రయాణి కులతో బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి.

ఇంటింటా సంబురాలు..

సంక్రాంతి రోజు సగటు రైతుల్లో సహజంగా ఆనందం వెల్లివిరుస్తుంది. వ్యవసాయం బాగా జరిగి దిగుబడి వచ్చిన ధాన్యం ఈనెలలోనే ఇంటికి వస్తుంది. ఒకవైపు ధాన్యపు రాశులు, మరోవైపు బతుకుదెరువు కోసం బయటకు వెళ్లిన బిడ్డలు ఇంటికి చేరుకోవడంతో పెద్దల్లో ఆనందానికి హద్దుల్లువుండవు. తమ ఇంటిల్లిపాది ఇలాగే సుఖసంతోషాలతో వర్ధిల్లాలని సంక్రాంతి సందర్భంగా ఇష్టదైవాలను వేడుకున్నారు. వివిధ ఆలయాల్లో పూజలు చేశారు. ఉదయాన్నే లేచి తలంటుపోసుకొని కొత్త బట్టలు ధరించి ఇంటిని అందంగా అలంకరించారు. అనంతరం ఇంటికి వచ్చిన అతిథులకు పిండివంటలు వడ్డించి సంతోషాన్ని పంచుకున్నారు. కొందరు పితృ తర్పణాలు సమర్పిస్తారు. కనుమ సందర్భంగా గోపూజలు చేశారు. ఇంటికి వచ్చిన అతిథులు, కుటుంబ సభ్యులతో కలిసి డీజే చప్పుళ్లకు ఆటపాటలాడుతూ స్టెప్పులు వేశారు. విందు, వినోదాలతో పండుగను జరుపుకున్నారు. పలువురు మహిళలు నోములు నోచుకొని తమ బంధువుల ఇళ్లకు వెళ్లి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

కనిపించని గంగిరెద్దులు

సంక్రాంతి పండుగ అంటేనే డూడూ బసవన్న గుర్తుకొస్తాడు. విలక్షణ వేషాధారణతో

» మిగతా 8వ పేజీలో...


భూపాలపల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


మల్హర్ మండలం తాటిచర్లలో లక్ష పసుపు కొమ్ముల నోములో మహిళలు

కాళేశ్వరాలయ అభివృద్ధికి సహకరించండి

కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రికి రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి


కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు

మహాదేవపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర, ముక్తేశ్వర దేవాలయాభివృద్ధికి సహకరించి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షేకావత్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గజేంద్ర సింగ్‌ను శ్రీధర్ బాబు బుధవారం కలిశారు. కాళేశ్వరాలయాన్ని అభివృద్ధి చేయడం తోపాటు రామగిరి కోటను టూరిజం హబ్‌గా మార్చాలని కోరారు. మంథని నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వరం, మంథని, రామగిరిని ఆధాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా గుర్తించాల న్నారు. దక్షిణ కాశీగా పేరు గాంచిన కాళేశ్వరం ఆలయాన్ని ఏటా లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారని తెలిపారు. ఈ ఏడాది మేలో నిర్వహించే సరస్వతి పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పుష్కరాల్లో పుణ్య స్నానం ఆచరించేందుకు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అలాగే 2027లో గోదావరి పుష్కరాలు జరగనున్నాయని అప్పుడు పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు కోటి మందికి పైగా వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన కాళేశ్వరాలయాన్ని కూడా ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, ఎకో టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. దాని అమలుకు కేంద్రం సహకరించాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం పుష్కరాలు మొదలయ్యే నాటికి అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. రామగిరి కోటకు 1200 ఏళ్ల చరిత్ర ఉందని, రామాయణంలో కూడా దీని ప్రస్తావన ఉందని అన్నారు. స్వదేశీ దర్శన్ 2.0 లేదా ఇతర పథకాల కింద రామగిరి కోటను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో బుధవారం స్నేహపూర్వక క్రికెట్ పోటీలు జరిగాయి. ప్రైవేటు లెక్చరర్ కె.సంజీవరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎ.గణపతి, మురళి సారథ్యంలో ఈ క్రీడోత్సవాన్ని నిర్వహించగా ఇందులో నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడలు క్రమశిక్షణతోపాటు ఉన్నతమైన ఆలోచనలను రేకెత్తిస్తాయని అన్నారు. క్రీడాకారులకు తన ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా సీఐ నరేష్ హాజరయ్యారు. మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ నాయకులు పిప్పాల రాజేందర్, సాంబమూర్తి, దాట్ల శ్రీనివాస్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఇస్లావత్ దేవన్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ


మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో విచారణకు వ్యవసాయ, రెవెన్యూ, డీఆర్డీఏ,

» మిగతా 8వ పేజీలో...

'సెపక్‌తక్రా'లో ఏఐపీ హవా

క్రీడాపోటీల్లో ఆలిండియా పోలీసు జట్టు చాంపియన్‌షిప్

ముగిసిన జాతీయస్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్


విజేతగా నిలిచిన జట్టు క్రీడాకారులతో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బొద్దిరెడ్డి, నిర్వాహకులు

7లో

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క


రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న మంత్రి ధనసరి సీతక్క

ఏటూరునాగారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏటూరునాగారంలో ఆమె మంగళవారం పర్యటించారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్‌గా ఎంపికైన మండలంలోని బానాజీబంధం గ్రామానికి చెందిన వసంత శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులను కాంగ్రెస్ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి పార్టీ మద్దతుతో పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో మృతి చెందిన మహిళా కాంగ్రెస్ కార్యకర్త తిరుపతమ్మ(నసీమా) కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించి రూ. 60 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సంక్రాంతి సందర్భంగా స్థానిక బస్టాండ్‌లోని సూపర్ మార్కెట్ యాజమాన్యం ఏర్పాటు చేసిన లక్కీ డ్రా కార్యమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు.

మంత్రి పర్యటనలో కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, కన్నాయిగూడెం మాజీ జడ్పీటీసీ గాంధీ, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, నాయకులు చెన్నూరు బలరాజు, వావిలాల నర్సింహరావు, వావిలాల చిన్నఎల్లయ్య, ముక్కెల లాలయ్య, గంపల శివ, కర్ల అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నుంచి తరలిస్తున్న గంజాయి పట్టివేత

రూ.1.25లక్షల సరుకు స్వాధీనం ▸ కారు డ్రైవర్‌తో కలిసి దందా



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సీఐ సర్వయ్య

కేసముద్రం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న గంజాయిని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన ప్రకారం...ఆంధ్రప్రదేశ్ నూజివీడుకు చెందిన పఠాన్ అస్లాంఖాన్, విశాఖపట్నం చల్లపల్లికి చెందిన క్యాబ్ డ్రైవర్ వెదుల ప్రదీప్ ఇరువురు కలిసి విశాఖ సీలేరు ప్రాంతంలో ఐదు కిలోల రూ. 1.25లక్షల విలువైన ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని హైదరాబాద్‌లో విక్రయించేందుకు జాతీయ, ఇతర ప్రధాన రహదారుల వెంట తనిఖీలు ఉంటాయని భావించి కేసముద్రం మీదుగా ప్రదీప్‌కు చెందిన కారులో తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఐ జి.మురళీధర్‌రాజ్ తన బృందంతో కలిసి మండలంలోని కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా గంజాయి రవాణా చేస్తున్న వాహనం పట్టుబడింది. వెంటనే ఇరువురిని అదుపులోకి తీసుకొని నిందితుల నుంచి ఐదు కిలోల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారు, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన ఎస్ఐతోపాటు పీసీలు ఆర్.రాజు, కె.రామకృష్ణ, డి.మహేందర్, బి.వెంకన్న, కె.మధులను రూరల్ సీఐ అభినందించారు.

చేపల వేటకు వెళ్లి..

▸ విద్యుదాఘాతంతో రైతు మృతి



గణేష్ (ఫైల్)

మరిపెడ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి విద్యాదాఘాతంతో గిరిజన యువ రైతు హలావత్ గణేష్(26) మృతి చెందిన సంఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గుర్రప్పతండాలో చోటు చేసుకుంది. బుధవారం స్థానిక ఎస్సై బోలగాని సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన సుధీర్, గణేష్ సంక్రాంతి పర్వదినం (మంగళవారం) సందర్భంగా ఆకేరు వాగులో కరెంట్ వైర్‌తో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో నీళ్లలో కరెంట్ తీగ వేసి, నీళ్లలోకి గణేష్ వెళ్లడంతో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. కాగా, గణేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరంలో పుష్కరాల పనులు షురూ



రాజగోపురం వద్ద జరుగుతున్న పనులు

మహదేవపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరాలయం త్రివేణి సంగమ గోదావరి సరస్వతి పుష్కరాల పనులు బుధవారం పనులు ప్రారంభమ య్యాయి. ఈ అభివృద్ధి పనులకు రూ. 35 కోట్ల అంచనా వ్యయం ఉండగా ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసింది. ఆలయ ప్రధాన గోపురం ముందు నుంచి రామాలయం వరకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మిగ తా పనులను కూడా త్వరగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

మహబూబాబాద్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం నడివాడలో వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తీగల రాజమ్మ(75) ఈ నెల 8న ధూమపానం చేస్తుండగా నిప్పు రవ్వలు మీదపడి రాజమ్మ దుస్తులకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. రాజమ్మను వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమారుడు యాకన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెదజల్లే పద్ధతితో లాభాలెన్నో..

▸ వరి సాగుబడిలో కొత్త ఒరవడి
▸ మొలకెత్తిన విత్తనాలు చల్లుతున్న రైతులు
▸ పెట్టుబడి ఖర్చు తగ్గుతోందంటున్న అన్నదాతలు

కాటారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారు. ఒకవైపు సాగుబడికి ఖర్చు బాగా పెరగడం, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు పంటలను నాశనం చేయడంతో ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. సాగు ఖర్చులను తగ్గించుకోవాలని భావిస్తున్నారు. పెట్టుబడి కోసం అధికంగా డబ్బులు వెచ్చించినా గిట్టుబాటు ధరలు కూడా రాని పరిస్థితులను అధిగమించేందుకు కొత్త ఆలోచనలకు కార్యరూపం ఇస్తున్నారు భూపాలపల్లి జిల్లా కాటారం మండల రైతులు.

మండలంలో గత ఏడాది యాసంగి సీజన్‌లో సుమారు 10 వేల ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుత సీజన్‌లో చెరువులు, బోరుబావులు, ఫిల్టర్ బోర్లు తదితర జలవనరుల ద్వారా వరి సాగు చేస్తున్నారు. ఈ యాసంగిలో సుమారు 10,500 ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. పలువురు రైతులు నారుమళ్లను ఏర్పాటు చేసి వరి నాట్లు వేస్తుండగా, మరికొందరు నాట్ల పద్ధతికి స్వస్తి పలుకుతున్నారు. మండలంలోని పలు గ్రామాల పరిధిలో కొందరు రైతులు వడ్లు వెదజల్లే పద్ధతి (బ్రాడ్‌కాస్టింగ్ మెథడ్)ని అవలంబిస్తున్నారు. విత్తనాలను నీటిలో నానబెట్టి మండె కట్టి కొద్దిగా మొలకెత్తిన అనంతరం మొలకలను పొలంలో చల్లుతున్నారు.

నాటు కోసం ఎకరాకు 25-30 కిలోల వడ్లు విత్తనాలుగా తెచ్చే రైతులు వెదజల్లే పద్ధతిలో కేవలం 10 కిలోలు మాత్రమే వినియోగిస్తున్నారు.



మొలకెత్తిన వడ్లను పొలంలో చల్లుతున్న రైతులు

నాటుకు ఎకరాకు రూ.5,000-6000 వరకు కూలీల ఖర్చు అయ్యే పరిస్థితి ఉండగా ప్రస్తుతం వెదజల్లే పద్ధతి రూ.500-1000తోనే సరిపోతుందని రైతులు అంటున్నారు. దీంతో ఎకరాకు రూ.4000-5,000 వరకు నాటు, విత్తనాల ఖర్చు మిగిలే అవకాశం ఉండటంతో ఆ మేరకు దిగుబడులు పెరిగినట్లేనని అభిప్రాయపడుతున్నారు. మండలంలో యాసంగి సీజన్ వరి సాగులో సుమారు 30శాతం వెదజల్లే పద్ధతితోనే అవుతుందని అంచనా. ఈ బ్రాడ్‌కాస్టింగ్ పద్ధతి విజయవంతమైతే రైతులకు రూ.2 కోట్లు ఆదా అయ్యే అవకాశం ఉంది. వెదజల్లే పద్ధతితో పంట కాలవ్యవధి, కొంత పెట్టుబడి ఖర్చు తగ్గే ప్రభావం ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు.



వెదజల్లడానికి సిద్ధంగా ఉన్న మొలకెత్తిన వడ్లు



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు



మేడారం పరిసరాల్లో భక్తుల రద్దీ

మేడారంలో మొక్కులు

మేడారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మల సన్నిధిలో మంగళ, బుధవారాల్లో భక్తుల సందడి నెలకొంది. తల్లులను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మినీ జాతరకు ముందుగానే మొక్కులు చెల్లించుకున్నారు. సంక్రాంతి పండుగ సెలవులు ఉండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. దేవతలకు తలనీలాలు సమర్పించి గద్దెల వద్దకు చేరుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించారు. యాట మొక్కులు తీర్చుకొని మేడారం పరిసరాల్లో విడిది చేశారు. రెండు రోజుల్లో సుమారు 25వేలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

సమన్వికి జగత్ విఖ్యాత అవార్డు

హనుమకొండ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణానికి చెందిన బొలినేని సమన్వి జగత్ విఖ్యాత అవార్డును అందుకున్నారు. ఖమ్మంలోని భక్త రామదాసు ఆడిటోరియంలో స్వర మాధురి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి జాతీయ ఉత్సవాల్లో పాల్గొని అద్భుతంగా నృత్య ప్రదర్శన ఇచ్చినందుకు సమన్విని నిర్వాహకులు ఈ అవార్డుతో సత్కరించారు. సమన్వి తల్లిదండ్రులు బొలినేని సాగర్‌రావు, మమత. నృత్యగురువు నాని మాస్టర్ సమన్వి జగత్ విఖ్యాత అవార్డును అందుకున్నందుకు కార్యక్రమ నిర్వాహకులు ఇసనపల్లి నగేష్, వేల్పుల వెంకటేష్‌తో పాటు పలువురు కవులు, కళాకారులు అభినందించారు.



సమన్విని సత్కరిస్తున్న స్వరమాధురి కల్చరల్ నిర్వాహకులు

నాగేంద్రుడికి సంక్రాంతి హరితశోభ

▸ ప్రత్యేక అలంకరణ మధ్య పూజలు
▸ భారీగా తరలి వచ్చిన భక్తులు



ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గీసుగొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడిని హరితమయంగా, గంగిరెద్దుల చిత్ర పటాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయ ప్రాంగణంలో వెయ్యి చెరుకు మొక్కలతో ప్రత్యేక అలంకరణలు చేసి సూర్యా, ఆదిత్యా ఆరాధనలు చేశారు. పల్లెసీమల పండుగ ప్రాశస్త్యానికి అద్దం పట్టేలా పాలపొంగిలి, సంక్రాంతి సిరులు, గంగిరెద్దుల బసవన్నల భక్తిప్రపత్తులు ఆలయ ప్రాంగణంలో వెల్లివెరిశాయి. కన్నుల పండువగా జరిగిన వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. సంవత్సర కాలంలో వివిధ రాశుల్లో భ్రమించే సూర్య భగవానుడు మకర రాశిలో ప్రవేశించి తన కాంతిని జీవకోటి మనుగడకు అందించటం వల్ల మకర సంక్రాంతిగా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు సంక్రాంతి ప్రాశస్త్యాన్ని వివరించారు. సూర్యుడు మకర రాశి సంక్రమణంతో ఉత్తరాయణ పుణ్యకాలం మొదలవుతుందని చెప్పారు. మకర సంక్రాంతి వరకు రైతులకు పంటలు చేతికి వచ్చిన సందర్భంగా ప్రజలు సంతోషంగా సంబరాలు జరుపుకోవడమే మకర సంక్రాతి ప్రాశస్త్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు శ్రీహర్షచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ ఎం బాబురావు, కొత్తగట్టు రాజేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ఇంద్రకాలనీలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన బుడెల్లి రాజు(37) గత కొన్ని సంవత్సరాలుగా ఇంద్రనగర్ కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్దినెలలుగా రాజు మద్యానికి బానిసై పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో రాజు మద్యం తాగేందుకు భార్య సుమలతను డబ్బులు అడుగగా ఆమె ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన రాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోగి నుంచి దుర్వాసన వస్తోందంటూ..

▸ వైద్యం చేసేందుకు నిరాకరించిన నర్సింగ్ ఆఫీసర్!
▸ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న డీఎంహెచ్‌వో

దంతాలపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర వాంతులతో 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఓ రోగి నుంచి దుర్వాసన వస్తోందంటూ ఓ నర్సింగ్ ఆఫీసర్ వైద్యం చేసేందుకు నిరాకరించిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలో జరిగింది. రోగి సోదరుడు ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన పులుగుజ్జ శంకరమ్మకు తీవ్రంగా వాంతులవుతుండటంతో ఆమె సోదరుడు బయ్య ప్రవీణ్, తల్లి రాధమ్మ బుధవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అప్పటికే నీరసంగా ఉన్న శంకరమ్మ నేలపైనే పడుకోగా.. ఆమెకు వైద్యం చేయాలని డ్యూటీలో ఉన్న నర్సింగ్ ఆఫీసర్ స్వప్నను కోరారు. కానీ నర్సింగ్ ఆఫీసర్ మాత్రం రోగి నుంచి దుర్వాసన వస్తోందని, పీహెచ్‌సీలో సిరంజి లేదని బయటి మెడికల్ షాపు నుంచి తెచ్చుకోవాలని అనడంతో శంకరమ్మ కుటుంబ సభ్యులు సదరు నర్సింగ్ ఆఫీసర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరగడం, సకాలంలో వైద్యం అందించకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రవీణ్, రాధమ్మ శంకరమ్మను ప్రైవేటు ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అయితే ఈ విషయంపై తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని శంకరమ్మ తల్లి, సోదరుడు తెలిపారు.



స్టాఫ్ నర్సు, రోగి కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాద దృశ్యం

ఇకయ పీహెచ్‌సీలో జరిగిన సంఘటనపై డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్‌ను సంప్రదించగా.. పీహెచ్‌సీకి వచ్చిన రోగికి వైద్యం నిరాకరించిన తీరుపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు. రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి వృద్ధుడి మృతి



మృతి చెందిన వెంకట్యా

కేసముద్రం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి వృద్ధుడి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఎస్ఐ మురళీధర్‌రాజ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని క్యాంపుతండ శివారు రాంసింగ్‌తండాలో మంగళవారం మధ్యాహ్నం వృద్ధుడు బానోత్ వెంకట్యా (70) ఇంటి ఎదురుగా ఉన్న ఎస్సారెస్పీ 15ఆర్ఎల్ ఉపకాల్వ ఉంది. ఉదయం కాల్వ వద్దకు వెళ్లిన అతడు ప్రమాదవశాత్తు జారి కాల్వలో పడి నీటి ప్రవాహ ఉధృతికి మునిగిపోయాడు. ఇరుగుపొరుగు వారు గమనించి వెంకట్యాను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని పెద్ద కుమారు వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంనకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా హేమాచలుడి వర పూజోత్సవం

భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

మంగపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరులో మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా వరపూజోత్సవ జాతర మంగళవారం జరిగింది. ముందుగా ఉత్సవ మూర్తులను హేమాచల కొండలపై నుంచి సన్నాయి. వాయిద్యాల మధ్య ఊరేగింపుగా పల్లకీలో తీసుకొచ్చారు. మల్లూరు వాగు వద్ద గ్రామస్థులు, పుర ప్రముఖులు ఎదురేగి ఎదురుకోళ్ల వేడుకను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు, ముక్కమల్ల రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో విశ్రాంత మంటపం వద్దకు తీసుకొచ్చి ఉత్సవమూర్తులను అధిరోహించారు. అనంతరం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో శ్రీ స్వామివారికి నిశ్చితార్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరువర్గాల నుంచి గ్రామపెద్దలు ఎదురేదుగా ఉండి వరపూజోత్సవం, కట్నం, కానుకలు మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రధానార్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, రామనర్సింహాచార్యులు ఆధ్వర్యంలో వరపూజ క్రతువును మేన పరిణయ సుముహూర్తం నిర్ణయించారు. ఈ వరపూజోత్సవ జాతరకు మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు గ్రామాల నుంచి సుమారు 40 వేల మంది భక్తులు హాజరయ్యారు.

అనంతరం ఉత్సవమూర్తుల విగ్రహాలను శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో కొలువుదీర్చారు. బుధవారం ఉదయం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా శ్రీ హేమాచలకొండపైకి ఆలయ ఈవో శ్రవణం సత్యనారాయణ ఆధ్వర్యంలో తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి ధనసరి సీతక్క కుమారుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య, యువజన కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు మహ్మద్ నిస్సార్ ఖాన్, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు అయ్యోరి యానయ్య, ఎర్రంకాని సురేష్, పూజారి సమ్మయ్య, నూతలకంటి ముకుందం, పూజారి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కర్రి నాగేంద్రకుమార్, వెంకట్‌రెడ్డి, బండ జగన్మోహన్‌రెడ్డి, వల్లెపల్లి శివప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మైల జయరామిరెడ్డి, కారుపోతుల నర్సయ్యగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, కొంకతి సాంబశివరావు, అర్చకులు ఏడునూతల ఈశ్వర్‌చంద్‌శర్మ, పవన్‌కుమారాచార్యులు, అనిపెద్ది మురళీకృష్ణశర్మ, వెంకటనారాయణశర్మ, రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ మహోత్సవంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, స్థానిక ఎస్సై టీవీఆర్. సూరి, ప్రొబేషనరి ఎస్సై సురేష్ నేతృత్వంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసు భారీ బందోబస్తును నిర్వహించారు.



హేమాచలకొండలోని ఆలయం నుంచి పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న అర్చకులు, ఉద్యోగులు



ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, ఉద్యోగులు



మల్లూరులో వర పూజోత్సవ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

మహానివేదనతో దేవుడి రథం

మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న మహానివేదన దేవుడి రథాన్ని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు స్వగృహంలో సుందరంగా పూలు, విద్యుత్తు లైట్లలతో అలంకరించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కొబ్బరికాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. మహానివేదనతో బయలు దేరిన రథం.. గ్రామ పురవీధుల గుండా ఆలయానికి చేరుకొని మూడుసార్లు ప్రదక్షణ చేసింది. మంగళ హారతులతో రథానికి మహిళలు స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రభబండ్లు రథాన్ని అనుసరించాయి. దేవుడి రథ ప్రదర్శన సాయంత్రం 7గంటల నుంచి తెల్లవారువరకు కొనసాగింది. రథంతో వచ్చిన టెస్కాబ్ చైర్మన్ దంపతులు మార్నేని మధుమతి - రవీందర్‌రావు దంపతులను ఈవో నాగేశ్వర్‌రావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కమ్మగోని ప్రభాకర్ గౌడ్ తదితరులు సంప్రదాయ పద్ధతిలో రథానికి ఎదురెళ్లి సన్మానించారు.


భక్తజనసంద్రమైన ఆలయ పరిసరాలు

లక్షల మంది భక్తుల దర్శనం

ఎప్పుడూ లేని విధంగా ధ్వజరోహణం ముందు ఈ నెల 11 నుంచే వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భోగి, సంక్రాంతి రెండు రోజుల్లో భక్తులు లక్షల్లో పాల్గొన్నట్లు దేవాదాయశాఖ అధికారుకు అంచనా వేశారు. 16న సంప్రోక్షణ క్రతువు తర్వాత ఉగాది వరకు జరిగే వారాంతపు జాతరలు ప్రతీ ఆది, బుధ 11వారాలపాటు లక్షల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి దర్శనం చేసుకుంటారు.

దర్శించుకున్న ప్రముఖులు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ఎండోమెంట్ డీసీ సంధ్యారాణి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు స్వాగతం పలికి శేషవస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు.

మల్లన్న.. శరణు.. శరణు..


స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, బీఆర్ఎస్ నాయకులు


మహానివేదనను తీసుకువచ్చిన పెద్దరథం ముందు మార్నేని దంపతులను సన్మానిస్తున్న ఈవో, ఉత్సక కమిటీ సభ్యులు

శిగాలూగిన ఐనవోలు జాతర • మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


భక్తిపారవశ్యంతో మూకుమ్మడి నృత్యాలు, (ఇన్‌సెట్‌లో) బోనాలతో నృత్యాలు

ఐనవోలు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి మహాజాతరలో భక్తులు పోటెత్తారు. సంస్కృతి, సంప్రదాయాలు, జానపదులకు ప్రతీకగా బండారితో ఐలోని క్షేత్రం మల్లన్న నామస్మరణంతో మారుమోగింది. మంగళవారం సంక్రాంతి పర్వదినం రోజున రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి మొదలైన భక్తుల రాక.. అర్ధరాత్రి వరకు రద్దీగా కొనసాగింది. ఐలోని మల్లన్న.. అంటూ స్వామి వారిని కీర్తిస్తూ పరవశించిపోయారు. జానపద గేయాలతో నృత్యాలు చేస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి తన్మయం చెందారు. ఆలయంలో అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, బిల్వార్చన మహానివేదన నీరాజన పుణ్యాహవాచనము పూజలు జరిపారు. మల్లికార్జునస్వామికి వెండి కిరీటం, కవచం, సుగంధాలు వెదజల్లే పుష్పమాలతో దేదివ్యమానంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి తెల్లవారువరకు అభిషేకాలు దర్శనాలు జరిగాయి.

అధికారుల సేవలు

జాతరలో పోలీసులు సేవలు అందించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి నేతృత్వంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసు కమాడ్ కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాల నిఘా నీడన జాతర బందోబస్తును డీసీపీ, ఏసీపీలు పరిశీలించారు. ఆయ ప్రాంతాలకు చెందిన సీఐలు, ఎస్సైలు సుమారు 400 మంది విధులు నిర్వహించారు. జాతర నోడల్ అధికారి తహసీల్దార్ విక్రమ్‌కుమార్ జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వసతులు కల్పించారు. ఎంపీవో రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో 4 మండలాల పారిశుధ్య సిబ్బంది, 4 రోజులపాటు నిర్విరామంగా విధులు నిర్వహించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈసారి జీడబ్లూఎంసీ పారిశుధ్య సిబ్బంది తక్కువగా హాజరుకావడమే కాకుండా అంతంత మాత్రంగానే సేవలందించారని అధికారులు గుర్తించారు. రహదారులను శుభ్రం చేసే వాహనాలను పంపించలేదు. ఆర్‌డబ్లూఎస్ శాఖ డీఈ రవీందర్, ఏఈ రవికుమార్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నీటి కొరతలేకుండా సరఫరా చేశారు. విద్యుత్తు లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జాతరలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తులైట్లు సరిగా వెలగకపోవడంతో చీకటిగా మారింది. కుడా అధికారులు విద్యుత్తు లైట్ల మరమ్మతులను విస్మరించారని ఎండోమెంట్ అధికారులు చెబుతున్నారు. ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్‌ఫేర్, చైల్డ్‌లైన్ శాఖల ఆధ్వర్యంలో 1098 ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీసుల ఆధ్వర్యంలో తప్పిపోయిన పిల్లలు, వృద్ధుల కోసం సహాయ శిబిరాన్ని నిర్వహించారు. వరంగల్ - ఐనవోలు - కొమురవెల్లి - ఆర్టీసీబస్సులు ద్వారా భక్తులను చేరవేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు వైద్యసేవలు అందించారు. రెవెన్యూ ఆర్ఐ మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ హెచ్‌ఐవీ అవగాహన కల్పించారు. పర్యాటకశాఖ బుక్‌లెట్ల ద్వారా ప్రచారం నిర్వహించగా, పౌరసంబంధాల శాఖ పత్తాకు కనిపించలేదు. ఎక్సైజ్‌శాఖ అధికారులు జాతరలో ప్రత్యేక నిఘా పెట్టారు. రెండు రోజులు ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచారు. అలాగే మంగళవారం అర్ధరాత్రి పంథిని, స్టేషన్‌ఘన్‌పూర్ గ్రామాల యువకుల మధ్య కొట్లాట జరుగగా, రాకేష్ అనే యువకుడి తలకు తీవ్రగాయాలు అయ్యాయి.

సెపక్‌తక్రాలో ఏఐపీ హవా

చాంపియన్‌గా ఆలిండియా పోలీసు జట్టు
ముగిసిన జాతీయస్థాయి సెపక్‌తక్రా చాంపియన్ షిప్

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పురుషుల, మహిళల విభాగాల్లో ఆలిండియా పోలీసు (ఏఐపీ) జట్ల క్రీడాకారులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించి ముందు వరుసలో నిలిచారు. తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జేఎన్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 34వ జాతీయస్థాయి సీనియర్ పురుషుల, మహిళల సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. టీమ్ ఈవెంట్, డబుల్స్ రెగో, క్వాడ్ నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో.. ఆల్ ఇండియా పోలీసు (ఏఐపీ) పురుషుల, మహిళ క్రీడాకారులు డబుల్స్ రెగో, క్వాడ్ విభాగాల్లో మూడింటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు వేటలో ముందు వరుసలో దూసుకుపోయారు. కాగా, పురుషుల డబుల్స్‌లో మణిపూర్ జట్టు, మహిళల విభాగంలో ఎస్ఎస్‌బీ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచాయి. అదే విధంగా మహిళల డబుల్స్‌లో ఆతిథ్య తెలంగాణ రాష్ట్ర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజతం పతకం సాధించగా పురుషుల డబుల్స్‌లో తృతీయ స్థానంలో నిలిచి నిరుత్సాహపరిచింది. జేఎన్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ముందు వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారుల మధ్య నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

విశిష్ట అతిథిగా తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై పలు విభాగాల్లో పతకాలు సాధించి విజేతగా నిలిచిన జట్లకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. హనుమకొండలో జాతీయస్థాయి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ క్రీడలు నిర్వహించడం ద్వారా జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంపొందుతాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసిన సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా, రాష్ట్ర బాధ్యులను ఆయన అభినందించారు. తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెక్కల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జేఎన్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి సీనియర్ పురుషుల, మహిళల సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో 28 రాష్ట్రాలు, మహిళల విభాగంలో 22 రాష్ట్రాల క్రీడాకారులతో పాటు ఆలిండియా పోలీసు, ఎస్ఎస్‌బీ జట్లు, 50 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారన్నారు. ఇక్కడ జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జపాన్‌లో జరుగనున్న ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యోగేందర్ సింగ్ దయ, సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్ ప్రధాన కార్యదర్శి వీరాగౌడ్, కోశాధికారి నరేష్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గాదెపాక అయోధ్య, ప్రధాన కార్యదర్శి జితేంద్రనాథ్, ఉపాధ్యక్షుడు గొర్రె రవీందర్, క్రీడా పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.ధన్‌రాజ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది శ్రీరాం కిరణ్‌కుమార్, టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలు, పీఈటీలు, కోచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

- **టీమ్ ఈవెంట్ పురుషుల విభాగంలో.. :** మణిపూర్ రాష్ట్ర జట్టు ప్రథమ స్థానం (స్వర్ణం), ఢిల్లీ ద్వితీయ స్థానం (రజతం), ఎస్ఎస్‌బీ, అస్సాం జట్లు తృతీయ స్థానం (కాంస్యం)
- **మహిళల విభాగంలో.. :** ఎస్ఎస్‌బీ ప్రథమ స్థానం (స్వర్ణం), నాగాలాండ్ ద్వితీయ (రజతం), మణిపూర్, ఉత్తరప్రదేశ్ తృతీయ స్థానం (కాంస్యం).
- **డబుల్స్ ఈవెంట్ పురుషుల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), బిహార్ ద్వితీయ (రజతం), హరియానా, తెలంగాణ తృతీయ (కాంస్యం).
- **మహిళల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), తెలంగాణ ద్వితీయ (రజతం), ఢిల్లీ, కేరళ తృతీయ (కాంస్యం).
- **రెగో పురుషుల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), ఢిల్లీ ద్వితీయ (రజతం), మణిపూర్, రాజస్థాన్ తృతీయ (కాంస్యం).
- **మహిళల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), హరియానా ద్వితీయ (రజతం), నాగాలాండ్, ఎస్ఎస్‌బీ తృతీయ (కాంస్యం).
- **క్వాడ్ పురుషుల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), ఎస్ఎస్‌బీ ద్వితీయ, (రజతం), మణిపూర్, బీహార్ తృతీయ (కాంస్యం).
- **మహిళల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం(స్వర్ణం), మణిపూర్ ద్వితీయ (రజతం), ఎస్ఎస్‌బీ, నాగాల్యాండ్ తృతీయ స్థానాల్లో నిలిచి కాంస్య పతకం సాధించింది.



మహిళల డబుల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన తెలంగాణ మహిళల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

వీరభద్రా.. శరభ.. శరభ..


భక్తులతో రద్దీగా ఆలయ ప్రాంగణం

వైభవంగా కొత్తకొండ జాతర
- వీరభద్రస్వామికి పెద్ద ఎత్తున మొక్కులు
- భక్త జన సంద్రంగా మారిన పరిసరాలు




కొత్తకొండ కొండపై ఉన్న స్వయంభూ ఆత్మలింగం

భీమదేవరపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తకొండ భక్త జనజాతరగా మారింది. ఎటు చూసినా క్యూలైన్లలో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుడి నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపొయింది. మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగనాడు లక్షలాది మంది వీరభద్రస్వామిని భక్తులు దర్శించుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కుమార్, వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, యువ ఐపీఎస్ పత్తిపాక సాయికుమార్, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఈవో కిషన్‌రావు, కాజీపేట ఏసీపీ తిరుమల్, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్, వంగర ఎస్‌ఐలు సాయిబాబు, దివ్యలు, మాజీ ప్రజాప్రతినిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ దేవాదాయ శాఖ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్‌రావు, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తాలు ఆలయానికి వచ్చిన ఆతిథులు, భక్తులకు స్వాగతం పలికారు. ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన 50మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో విశిష్టమైన సేవలందించారు. హనుమ కొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగామ, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. హుజూరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్ధిపేట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపడం, ప్రైవేట్ వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈనెల 14న మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ఎడ్లబండ్లు తిరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన భక్తులతో జాతర మొత్తం కిటకిటలాంది. భక్తుల రద్దీతో కొత్తకొండ వీధులన్నీ భక్త జనంతో నిండిపోయాయి. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారిని దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ సలీమా, ఏసీపీ తిరుమల్, సీఐ పులి రమేష్, ఎస్‌ఐలు సాయిబాబు, దివ్యల ఆధ్వర్యంలో సుమారు 600మంది పోలీసులు జాతరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరను విజయవంతంగా పూర్తి చేశారు.

ప్రత్యేక పూజలు

సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి మంగళవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. స్వామివారికి కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి ఆలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా పూజలు నిర్వహిస్తే సమస్త పీడల నుంచి విముక్తి కలిగి భోగభాగ్యాలు ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో లక్షలాదిమంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు. బుధవారం నాగవెల్లి, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నల్లపూసలను అలంకరింపజేశారు. అనంతరం పుష్పోత్సవం నిర్వహించారు. కొత్తకొండ కొండపై ఉన్న స్వయంభూ లింగేశ్వరస్వామికి అభిషేకం నిర్వహించారు. యేడాదిలో రెండు సార్లు మాత్రమే స్వయంభూ లింగేశ్వర స్వామికి అభిషేకం చేస్తారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఒకనాడు, రెండోది శ్రావణ అమవాస్య నాడు స్వయంభూ లింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తారు. కనుమ పండుగను పురస్కరించుకొని ఆలయం ముందు ఉన్న నందీశ్వరస్వామికి పెద్దఎత్తున పూజలు నిర్వహించారు.

తరలివచ్చిన లక్షలాది మంది భక్తులు

కొత్తకొండ దేవాలయంలో మకర సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని మంగళ, బుధవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తాలు తెలిపారు. మకర సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో భక్తులతో ఆలయం మొత్తం కిటకిటలాడగా క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో రాత్రి వేళల్లోనే జాతర ఎక్కువ సాగేది. అలాంటిది ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


గుమ్మడికాయ, కోడె మొక్కులు చెల్లిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్


మొక్కులు చెల్లించేందుకు వస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

ప్రత్యేక ఆకర్షణగా కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు

కొత్తకొండ జాతరకే కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తపల్లి గ్రామం నుంచి 64 ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు. మూడు రోజులుగా రైతులు కష్టపడి తమ ఎడ్లబండ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది జాతరకు తీసుకొచ్చారు. 64 ఎండ్ల బండ్ల రథాలను మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఇంటికి వెళ్లిపోయాయి. అందమైన ఎడ్లబండ్లను చూసేందుకు జాతరకు వచ్చిన భక్తులు ఆసక్తిగా చూశారు. ముల్కనూరులో మహిళలు రథాల ముందు నీళ్లు పోసి, మంగళహారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. వీటితో పాటు వేలాది ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశాయి. వేలేరు గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు ఆకట్టుకున్నాయి. కొన్నేళ్లుగా మేకలబండ్లు వేలేరు నుంచి రావడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం అర్ధరాత్రి మేకల బండ్లు రావడంతో ఆలయ అధికారులు వాటిని ఆలయం ముందుకు తీసుకవచ్చారు. ఆలయ ఈవో కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామాల సునీతలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారిశుధ్యం

కొత్తకొండ జాతరలో పారిశుధ్య సేవలు వేగంగా జరిగాయి. డీపీవో లక్ష్మీరమాకాంత్, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవోలు నాగరాజు, రవి పర్యవేక్షణలో పారిశుధ్య సేవలు రాత్రి పగళ్లు అందించారు. సుమారు 40మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు, 200మంది కార్మికుల సిబ్బందితో ఆలయం చుట్టూ, పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుధ్య కార్మికులు 24గంటలు చెత్తను తొలగించారు. ప్రతీ దుకాణం ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. జాతరలో చెత్తా చెదారం, చెడిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు.


ఆలయం ఎదుట ఉన్న నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు


వేలేరు నుంచి వచ్చిన మేకల రథం


పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

26 నుంచి కొత్త పథకాలు

• కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం రోజైన ఈనెల 26 నుంచి నాలుగు కొత్త పథకాలు అమలవుతున్నాయని, లబ్ధిదారుల ఎంపిక కోసం 16 నుంచి 20 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర తెలిపారు. ఈమేరకు బుధ వారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులను అర్హులందరికీ చేర్చేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకూ పంట వేసినా, లేకున్నా రైతు భరోసా అందుతుందని తెలిపారు. భూమి విస్తీర్ణం విషయంలో ఎటువంటి పరిమితులు లేవని, ప్రతి ఎకరా కూ రూ.12వేల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అంది స్తుందని తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలను అందించనున్నట్లు పేర్కొన్నారు. రెండు విడతలుగా ఈ సాయం అందిస్తామన్నారు. 2023-24 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన కూలీల జాబితాను తీసుకొని ఆధార్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని వివరించారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే పూర్తయిందని, 16నుంచి 20వరకు జరిగే గ్రామ సభలలో అభ్యంతరాలు స్వీకరించి మొదటి విడత జాబితాను రూపొందిస్తామని తెలిపారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి ఈ పథకాలపై ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మరిన్ని వివరాల కోసం 1800-4257109 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఇంటింటా సంక్రాంతి

• ఘనంగా జరుపుకున్న జిల్లా ప్రజలు
• ముగ్గులతో కళకళలాడిన ముంగిళ్లు
• స్వగ్రామంలో మంత్రి సీతక్క
• కుటుంబ సభ్యులతో కలిసి పండుగ



ములుగులోని రామాలయంలో గోదాదేవి-రంగనాథస్వామి కల్యాణం

ములుగు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి వేడుకలు ఊరూరా ఘనంగా జరిగాయి. సంప్రదాయ పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. రంగురంగుల ముగ్గులతో వాకిళ్లన్నీ కళకళలాడాయి. బంధుమిత్రుల కోలాహలంతో ప్రతీ ఇల్లూ సందడిగా మారింది. ఉదయం ఇష్టదైవాలకు పూజలు చేశారు. అనంతరం ఇంటిల్లిపాది విందు భోజనాలు ఆరగించారు.

ఆలయాల్లో పూజలు

మకర సంక్రాంతి ఘడియల్లో ప్రతీయేటా ఆలయాలలో గోదాదేవి-రంగనాథ స్వామి కల్యాణం జరిపించడం ఆనవాయితీ. ములుగులోని శ్రీక్షేత్రంలో శ్రీసీతారామచంద్రాస్వామి దేవాల యంలో మంగళవారం వేదపండితుల మంత్రోత్సార ణల నడుమ కనుల పండువగా వివాహ క్రతువును జరిపించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు ఆశీర్వచనాలు తీసుకున్నారు. అదేవిధంగా స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య ఆడబిడ్డలు రేపలెవాడ, కలియుగ వైకుంఠ నోముల కార్యక్రమం నిర్వహించారు. గంగిశెట్టి స్రవంతి, కొమురవెల్లి లిఖిత, స్వప్న, గర్రెపల్లి కుసుమ ఆద్వర్యంలో తొలిసారిగా ములుగులో జరిగిన ఈ వేడుకలో



ములుగులోని నగరేశ్వరస్వామి ఆలయంలో కలియుగ వైకుంఠ నోములో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. ములుగు మండలం జగ్గన్నపేటలో పుట్టమల్లన్న జాతర జరిగింది. స్థానిక యాదవుల కులదైవమైన పుట్టమల్లన్న దర్శనానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ధనసరి సూర్య, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.

జగ్గన్నపేటలో మంత్రి సీతక్క

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తన స్వగ్రామమైన ములుగు మండలం జగ్గన్నపేటలో సంక్రాంతి పండుగ జరుపుకున్నారు. తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి పిండివంటలు తయారు చేశారు.



జగ్గన్నపేటలోని తన నివాసంలో సకినాలు పోస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు

సంక్రాంతి సందర్భంగా ఆయా గ్రామాలలో ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహించారు. యువజన సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ములుగు కలెక్టరేట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ములుగు పోలీసులు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల అరెస్టు దారుణం

జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహరావు



ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయించడం దారుణమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై నిరసనకు దిగుతున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారని విమర్శించారు. ఈ అరెస్టుల ద్వారా బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తోందని, అది ఎన్నటికీ సాధ్యం కాదని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో కాకులమర్రి ప్రదీప్ బాబు, తాడూరి రఘు, ఎమ్డీ. వలీబాబా, బాస పుల్లయ్య, మెరుగు వెంకటేశ్వర్లు, శేషు, అక్బర్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలి

వాజేడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు వావిలాల స్వామి మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చింతూరులో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు చెన్నం స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో స్వామి మాట్లాడారు. ఈ నెల 18న జిల్లా కేంద్రానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సన్నాహక సమావేశానికి వస్తున్నారని, మాదిగలు వేలాది మంది తరలి రావాలని కోరారు. ఫిబ్రవరి 7న జరగబోయే మహాప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్యాల రాకేష్ మాదిగ, లేగల రవి, బక్కయ్య, సమ్మయ్య, ములకల సావిత్రి, సుగుణ, రజిని తదితరులు పాల్గొన్నారు.

వాజేడులో 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

వాజేడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బుధవారం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు పార్టీల నాయకులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి సర్దార్ సింగ్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. త్వరలో ప్రభుత్వం పేదలకు ఇళ్లు మంజూరు, రైతు భరోసా తదితర పథకాలపై మార్గదర్శకాలను తెలియజేశారు. గ్రామాల్లో అర్హులను ఎంపిక చేయటంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకులు పూనెం రాంబాబు, చెన్నం ఎల్లయ్య, ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

వెంకటాపూర్, జనవరి 15, (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువతరం యూత్ అధ్యక్షులు కల్లబోయిన కిరణ్ ఆధ్వర్యంలో బుధవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయితీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బాలల పరిరక్షణ జిల్లా అధికారి జంగిళి ఓంకార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. కారోబార్ రమణ, యూత్ సభ్యులు గుర్రాల లోకేష్, మంద వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నంపల్లిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలి : గోవింద్ నాయక్

ములుగు కలెక్టరేట్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వందశాతం గిరిజన జనాభా ములుగు మండలంలోని అన్నంపల్లిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పోరిక గోవింద్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగ్గన్నపేట పంచాయతీలో అంతర్భాగంగా ఉన్న అన్నంపల్లి జిల్లాకేంద్రానికి నాలుగు కిలోమీటర్లు, గ్రామపంచాయతీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వం తండాలను జీపీలుగా గుర్తించిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న గుంటూరుపల్లిని కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిందని, అన్నంపల్లిని జీపీగా ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్కను గోవింద్‌నాయక్ కోరారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

కాటారం, జనవరి 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని దామెరకుంట గ్రామపంచాయతీ పరిధిలో బాసాని రామయ్య, తోడె బాపురెడ్డి స్మారకార్థం రెండు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. విజేతగా నిలిచిన కుమార్ జట్టుకు మాజీ ఎంపీటీసీ బాసాని రవి రూ.5,016 నగదు బహుమతి అందించారు. రన్నరప్ జట్టుకు గుర్రెడ్డి సాయి రూ.3,016, తృతీయ స్థానం సాధించిన జట్టుకు అఫ్జల్ రూ.1,516 నగదు అందించారు.

మినాజిపేటలో శ్రీపాదరావు స్మార్థకార్థం..

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మీనాజిపేటలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాధరావు స్మారక వాలీబాల్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఐదు మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ: 10వేలు అంబటిపల్లి క్రీడాకారులు గెలుపొందగా, రెండో బహుమతి రూ: 5 వేలు కనుకునూర్, మూడో బహుమతి రూ: 2500 బోర్లగూడెం జట్లు గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో గంట్ల దేవేందర్‌రెడ్డి, మోతుక్కూరి రవి, నీలాల రాజు, రాజేందర్, రాజశేఖర్, మల్లేష్, రమేష్, తిరుపతి, చంద్రమౌళి, రాజగోపాల్ పాల్గొన్నారు.

వోల్వో ట్రక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కనకయ్య



గణపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గణపురం మండలంలోని ఓపెన్‌కాస్టు-3 వోల్వో ట్రక్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన మాచర్ల కనుకయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బాలకృష్ణ, సురేందర్, రవి, అశోక్, ఆకుతోట వేణు, శశికుమార్, మల్లేష్, హకీమ్, శంకర్, శ్రీనివాస్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల ఎస్సైగా సుధాకర్

టేకుమట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): టేకుమట్ల ఎస్సైగా డి. సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భూపాలపల్లి ఎస్సైగా పనిచేసిన ఆయన బదిలీపై వచ్చారు. టేకుమట్ల ఎస్సైగా పనిచేసిన ఎస్సై భూపాపల్లికి బదిలీ అయ్యారు. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌ను మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డితో పాటు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

అయ్యప్ప ఆలయంలో మకర జ్యోతి దర్శనం



మకరజ్యోతిని దర్శించుకుంటున్న అయ్యప్ప భక్తులు

కాటారం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో మంగళవారం సాయంత్రం వెలిగించిన మకర జ్యోతి దర్శనం కోసం భక్తులు, దీక్షాపరులు పెద్దఎత్తున తరలివచ్చారు. శబరిమలైలో లాగానే ఆలయంలో ప్రతి ఏటా మకర సంక్రాంతి సందర్భంగా పదునెట్టాంబడి, ఆలయం ఎదుట జ్యోతిని ముట్టించడం ఆనవాయితీ. వేద పండితుడు భాను శర్మ ఆధ్వర్యంలో మెట్ల పూజ నిర్వహించి, దీపాలను వెలిగించారు. శబరిమలైలో జ్యోతి కనిపించే సమయంలో ఆలయం ప్రధాన ద్వారం పైన మకర జ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బచ్చు అశోక్, రామకృష్ణారావు, రంజిత్‌కుమార్, చీమల రాజు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మధూకర్, చీమల శ్రీనివాస్, మద్ది నవీన్, సంజీవరావు, పూర్ణచందర్‌రావు, శ్రావణ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రాజుపేటలో షటిల్ టోర్నీ



బహుమతులు ప్రదానం చేస్తున్న నాగజ్యోతి

మంగపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురష్కరించుకొని రాక్ యూత్ ఆధ్వర్యంలో మండలంలోని రాజుపేటలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల షటిల్ టోర్నమెంట్‌ను మంళవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ నాగజ్యోతి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడుముల లక్ష్మీనారాయణ, గుండేటి రాజు యాదవ్, జిల్లా నాయకులు తుమ్మ మల్లారెడ్డి, జగదీశ్, కర్రి శ్యాంబాబు, మండల ఆర్గనేజర్ చల్లగురుగుల తిరుపతి, ఏటూరునాగారం మాజీసర్పంచ్ ఈసం రామ్మూర్తి, సహకార సంఘం డైరెక్టర్ మాదరి రామయ్య పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి



బహుమతులు అందిస్తున్న సూర్య, అశోక్

వెంకటాపూర్, జనవరి 15, (ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాలయాను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సూర్య అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకోని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి ఆధ్వర్యంలో వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ముగ్గుల పోటీలు నిర్వహిం చగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, స్థానిక ఏఎస్సై జక్కుల సతీష్‌తో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరెడ్డి భగవాన్‌రెడ్డి, మేడారం డైరెక్టర్ మీల్కూరి ఐలయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ కాసర్ల కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ జంగిళి శ్రీలత రవి యాదవ్, పాఠశాల మాజీ ఛైర్మన్ చీకుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లూరులో..

మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరులో సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకొని సూర్యన్న యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో 30 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ బుధవారం ముగిసింది. విజేతలకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సూర్య బహుమతులు ప్రదానం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి,

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

(5వ పేజీ తరువాయి)

పంచాయతీరాజ్ అధికారులతో ప్రత్యేక టీంలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల తుది జాబితాను ఖరారు చేయాలన్నారు. ప్రతి గ్రామసభ పంచాయతీలో ఈనెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో విచారణ, 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామసభల్లో వచ్చే ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామసభ నిర్వహణపై ఒక రోజు ప్రచారం చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ, సర్వేయర్లు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయం చేయని భూములను గుర్తించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలనుసారం వ్యవసాయ భూములకు మాత్రమే రైతుభరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. 2023-24 సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధిహామీ పనిదినాలు పూర్తిచేసుకున్న భూమిలేని కుటుంబాలు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని తెలిపారు. అర్హుల జాబితాను గ్రామసభల్లో ప్రదర్శించాలని, ప్రజల్లో ఎలాంటి అపోహలు తలెత్తకుండా గ్రామసభలు నిర్వహించాలని అన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి మాత్రమే నూతన రేషన్‌కార్డు పథకం వర్తిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షల వార్షికాదాయంతో పాటు 3.5 ఎకరాల వెట్, 7ఎకరాల డ్రై ల్యాండ్ ప్రామాణికంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి గ్రామాల్లో పక్కాగా సర్వే నిర్వహించి గ్రామసభల్లో అర్హుల జాబితాను ప్రదర్శించాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, అన్ని మండలాల ప్రత్యేక అధికారుల పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

ఏటూరునాగారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలోని కొమరవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. యాదవ, కావు సంఘాలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. అర్చకులు సూర్యనారాయణ శర్మ, మణికంఠ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద పట్నం వేయ డం, గణేష్ పూజ, పుణ్యహావచం, అంకురార్పణ జరిగాయి.



మల్లికార్జున స్వామి కల్యాణంలో అర్చకులు

ప్రత్యేక అధికారులు వీరే..

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26 నుంచి అమలు చేయ నున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేం దుకు కలెక్టర్ రాహుల్‌శర్మ మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. వారి జాబితాను విడుదల చేశారు. భూపాలపల్లి మండలానికి నారాయణ రావు(డీపీవో), చిట్యాలకు చిన్నయ్య(డీడబ్ల్యూవో), గణపురం మండలానికి కుమారస్వామి(డీవీహెచ్‌వో), కాటారం మండలానికి నరేష్ (డీఆర్డీవో), మల్హర్‌కు అవినాష్(మత్స్య శాఖ అధికారి), మహదేవపూర్‌కు వీరభద్రయ్య (డీఎల్‌పీవో), మహాముత్తారం వెంకటేశ్వర్లు(ఎస్సీ కార్పొరే షన్ అధికారి), మొగుళ్లపల్లికి సునీత (సోషల్ వెల్ఫేర్ అధికారి) రేగొండ సునీల్ (ఉద్యానవన శాఖ అధికారి), పలిమెలకు విజయ్‌భాస్కర్(డీఏవో), టేకుమట్లకు శైలజ (బీసీ వెల్ఫేర్ అధికారి)ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సకుటుంబ సపరివారంగా..

(5వ పేజీ తరువాయి)

గంగిరెద్దుల ను తీసుకొచ్చి ఇంటిముందుకు నాట్యామాడిచడం ఆనవాయితీ. అలాగే నారథుడి వేషాధారణతో చిరుతలు వాయి స్తూ బిక్షాటనకు వచ్చే వారు కూడా సందడి చేస్తుంటారు. అయితే.. ఈసారి ఇవి ఎక్కడా కనిపించలేదు. దీంతో రానురాను ప్రజల్లో ఈ పండుగ ఆనవాయితీపై మోజు తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమ య్యాయి. అలాగే కోడి పందేలు ఆటల ఎక్కడా కానరాలేదు. వాటిని కట్టడి చేయడంలో జిల్లా పోలీసులు సఫలీకృతమయ్యారు. అయితే.. పందెం కోళ్లను పలువురు పెంచుకోగా ఆంధ్రా నుంచి ఇక్కడికి వచ్చిన వ్యక్తులు వాటిని రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చుపెట్టి కొనుగోలు చేయడం కనిపించింది.

తాడిచర్లలో లక్ష పసుపు కొమ్ముల నోములు

సంక్రాంతి పర్వదినం సందర్భంగా మల్హర్ మండలం తాడిచర్ల లక్ష్మీదేవర ఆలయంలో బోనాలు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అదే మండలంలోని మల్లారం హనుమాన్ దేవాలయంలో బుధవారం కనుమ పండుగ సందర్భంగా మహిళలు లక్ష పసుపు కొమ్ముల నోమును నోచుకున్నారు. అర్చకుడు శ్యాం సుందర్ శర్మ ఈ తంతు పూర్తి చేయించారు.

చికిత్స పొందుతూ మృతి

మహదేవపూర్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెగ్లూర్ గ్రామానికి చెందిన దందేర మహేష్(30) అనే వ్యక్తి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం పలిమెల మండలం పంకెన వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతడిని మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి వందపడకల ఆసుత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మ హేష్ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై తమాషారెడ్డి తెలి పారు. సంక్రాతి పండగ రోజు మహేష్ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుము కున్నాయి. మహేష్‌కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బొల్లారంలో భూపాల్‌నగర్ వాసి..

ములుగు (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా బొల్లారంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ములుగు మండలం భూపాల్‌నగర్‌కు చెందిన సపక శ్రీను(40) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. బతుకు దెరువు కోసం భార్య సరితతో కలిసి బొల్లారానికి వలస వెళ్లిన శ్రీను అక్కడే నివాసం ఉంటూ ప్రైవేటు కంపెనీలలో పనిచేస్తున్నాడు. శనివారం తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిని వాటర్ ట్యాంకర్ ఢీకొనడంతో శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం శ్రీను మృతిచెం దాడు. మంగళవారం స్వగ్రామమైన భూపాల్‌నగర్‌లో అంత్యక్రియలు జరిగాయి. మృతునికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉరివేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య

మంగపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకొని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని పద్మశాలి వాడలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చెట్టె నాగమ్మ(80) భర్త గౌరయ్య చాలా ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఒంటరి అయిన నాగమ్మ మంగపేటలోని కస్తూర్బా అనాథాశ్రమంలో ఉంటోంది. పండుగపూటకు తమ ఇళ్లకు వృద్ధులు అందరూ వెళ్లగా నాగమ్మ కూడా తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ తర్వాత సంక్రోని ఒర్రె అటవీ ప్రాంతంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బుదవారం ఉదయం అడవికి వెళ్లిన పశువుల కాపర్లు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సూరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

అడవి పందిని ఢీకొన్న బైక్.. ఒకరికి తీవ్ర గాయాలు

ములుగు కలెక్టరేట్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అడవి పందిని ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ములుగు మండలం రాంనగర్‌తండాకు చెందిన నూనావత్ రాజేందర్ ఈనెల 10న రాత్రి తన ద్విచక్రవాహనంపై జంగాలపల్లికి వెళ్తుండగా రోడ్డుకు అడ్డంగా అడవిపందుల గుంపు వచ్చింది. చీకట్లో వాటిని గమనించక ఆయన ఢీకొట్టి కింద పడ్డాడు. ఈఘటనలో తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రస్తుతం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

లోయలోకి దూసుకెళ్లిన కారు

• ఇద్దరికి స్వల్పగాయాలు
• చెట్టు అడ్డు ఉండటంతో తప్పిపెను ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

మంగపేట, జనవరి (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రానికి వెళ్తున్న భక్తుల కారు గుట్ట ఎక్కుతున్న క్రమంలో అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన సింగరేణి ఉద్యోగి దోసపాటి కిషోర్ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి మంగపేట మండంలోని హేమాచల లక్ష్మీన రసింహస్వామిని దర్శించుకొనేందుకు వచ్చారు. వీరి కారు గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో ఒక్కసారిగా అదుపు తప్పి వెనిక్కి వెళ్తూ లోయ వైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కిషోర్ దంప తులకు స్వల్ప గాయాలయ్యాయి. కారులో లోయలోకి పడిపో కుండా చెట్టును తట్టుకొని ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.